# కడుపు మంట

*    రచన: "ధనాలకోట"    *

వాడి ఎర్రబారినకళ్ళు నిద్రలేమిని సూచిస్తున్నవి. వారంరోజులనుండి పెరిగిన గెడ్డం, నూనెనెరుగని తల, మురికి బట్టలు, ధనహీనతను చూపెట్టుతున్నవి. కండ్లవెంట రాబోయే నీటిని ఆపుకొంటూ "ఆంధ్ర సబ్బు కర్మాగారం" వారి ఆఫీసులో పెద్ద గుమాస్తావద్దకు పోయేడతడు.

"ఎవడ్రా అది?" అన్నాడా గుమాస్తా కళ్ళద్దాలు పంచె చివరతో తుడుస్తూ.

"ఏం, మాట్లాడవ్? చెవుడా" పెద్దగుమాస్తా కళ్ళద్దాలు ముక్కుమధ్యంగా నిలువబెట్టేడు. "ఆఁ! నువ్వు షణ్ముఖం కాదురా? ఏంటే వేషం అంతా?"

షణ్ముఖం కన్నీరు కార్చేస్తూ అన్నాడు. "మా బాబు సచ్చిపోయేడు సార్".

ఈలోగా చుట్టుపక్కల గుమాస్తాలంతా అక్కడకు చేరుకున్నారు.

"ఆఁ కణ్ణప్పా?" అన్నాడు పెద్ద గుమాస్తా "శివశివ ఎప్పుడూ?—ఓగంట కిందేనా?"

"అయ్యోపాపం" ఒక ముసలి గుమాస్తా కంట తడిబెట్టేడు. "చాలా యోగ్యుడండీ, కణ్ణప్ప. వాడి పనీ, వాడి లోకం ఏదో, అంతే. మంచి పనివాడు కూడాను...మరి శవాన్ని—"

"ఢబ్బ—" అనీ ఏడ్వడం మొదలుబెట్టేడు షణ్ముఖం.

పెద్ద గుమాస్తా కడుపు చెరువై పోయింది. "ఊరుకోరా, అబ్బీ" అన్నాడు షణ్ముఖం వైపు చూస్తూ. "మేమంతా ఉన్నాం కాదూ! పాపం జీతాల ముందు పోయేడు" గుమాస్తాలవైపు తిరిగి "ఈ కార్మాగారంస్థాపించినది మొదలు-కడచిన 35 ఏళ్ళూ-యిక్కడే పనిచేసేడు, కణ్ణప్ప. చాలా యోగ్యుడు పాపం. ఎవరికెంత వీలైతే అంత సహాయం చేద్దాం మనం అంతా...సరే, షణ్ముఖం, నీవు చెట్టిగారితో చెప్పిరారా. ఏడ్చే మిలాభం? వెళ్ళిరా."

షణ్ముఖం మేడమీదికి త్వరగా పోయేడు. గుమాస్తాల దయవాడికి చాల ఆశ కల్పించింది. ప్రొప్రయిటరు చెట్టి ఒక పదిరూపాయలన్నా యిస్తాడని ధైర్యం కల్గింది. ఆ భవనం క్రింది భాగం ఆఫీసు, పైని చెట్టిగారి వసతి. చెట్టి మేడమీద వరండాలో పచారుచేస్తూ వాడి దరిద్రాకారాన్ని మెట్లమీదచూసి ఆగేడు. వాడివైపు శరీరంలోకి చొచ్చుకొపోయేటట్లు ఎగాదిగా చూసేడు. ఆ చూపుతో షణ్ముఖం తడబడ పడిపోయేడు. మెట్లమీద కాలుజారిపడి పోవల్సిందే కాచుకొన్నాడు. తనకన్న బలమైన కోరికను లొంగి నిలబడగల్గేడు, నాల్గుమెట్లక్రిందుగా.

"ఏం?"

"మా బాబండి, కణ్ణప్ప. తమ దగ్గిరే పంచేసేడండి, పుట్టిందగ్గర్నుంచి మొన్నటి దాకా." చెట్టి కళ్ళల్లోకి చూడలేక ముఖం క్రిందికి దించేసేడు. "నాను సాలాపాపం సేసుకున్నాండి-"

"అయితే?"

"శవం తీసుకుపోవాలండి."

"ఎవరి శవం?".

"మాబాబుదేనండి. పొద్దున్నే సచ్చిపోనాండి"

"తీసుకుపో" చెట్టివాడ్ని మళ్ళీ తన దృక్బాణాలికి గురిగా చేసేడు. షణ్ముఖం ఆయనవైపు చూడబోయి మళ్ళా బుర్ర దించేసేడు. "నేనేమి యివ్వదలచుకోలేదు, పో" షణ్ముఖం యింకా నిలబడ్డాడు.

"పోరా, పో, పో."

షణ్ముఖం క్రిందికి పారిపోయేడు. కర్ర చూపబడ్డ కుక్కలాగు.

"ఏరా" అన్నాడు పెద్ద గుమాస్తా, "ఏం సంగతి?",

"పొమ్మన్నారు సార్, ఏమీ ఇవ్వనన్నారు"

"ఆఁ, ఏమి అన్యాయం ఇది? ముప్పైఏళ్ళు పం చేసి చచ్చిపోయినవాడి అంత్య క్రియలకు యజమాని ఏమీ ఇవ్వకపోవడం? శివశివ!— రండయ్యా, అడుగుదాం."

— గుమాస్తాలు పదిమంది మేడమెట్లెక్కేరు, గొణగొణ లాడుతూ. ఆ శబ్దానికి పైకి వచ్చేడు చెట్టి.

"ఏం యిదంతా?" అన్నాడు.

"వాడు, కణ్ణప్ప చచ్చిపోయేట్టండి." పెద్ద గుమాస్తా అన్నాడు.

"విన్నాను."

"వాడి అంత్యక్రియలకు మేమంతా కల్సి పది రూపాయ లిస్తున్నామండి."

"సంతోషం."

"తమరు—"

"నే నేం యివ్వదల్చుకోలేదు."

"అయ్యో!..." గొణగొణ "పాపం, ముప్ఫై యేళ్ళు—"

"క్రిందకుపోయి మీపని మీరు చూసుకోండి. అనవసరపు సంభాషణ మాని" అని చెట్టి లోనికి నిష్క్రమించేడు.

అంతగంభీరంగా మాట్లాడి లోనికిపోయేడన్న మాటేగాని చెట్టికి మనసు ఏమీ బాగులేక పోయింది. ధార్మికస్వభావుడైనా షణ్ముఖాన్ని చూసినప్పట్నుంచి వాడికేమీ యివ్వకూడదని పించింది. వాడు కాకుండా వాడితరఫున ఎంకెవ రయినావస్తే డబ్బిచ్చేవాడే.

"అయ్యో,పాపం! వాడి తండ్రి చచ్చిపోయేడే ఏమన్నా యిస్తే బాగుండునే' అని ఒకవిచారం. 'నీవు ఏమీ ఇవ్వకపోవడం రైటేనేమో" అని ఒకతలపు. ఈ మనోయుద్ధంలో ఆయన ఏమీ పనిచేసుకోలేకపోయేడు. కాలం ఎలాగో వెళ్ళ బుచ్చాలని భోజనమయ్యేక తనబావమరిదివద్దకు వెళ్లేడు కారులో. తన భావమరిదిదీ ఒక గాజు పరిశ్రమ. ఊరికిబయట పదిమైళ్ళదూరంలో ఉంది ఫ్యాక్టరీ. అక్కడే ఆఫీసు కూడాను.

బావమరిది ఆఫీసుల్లో లేడు. చెట్టి ఫ్యాక్టరీ లోకి వెళ్ళేడు. ఒకమూలను ఒక ముసలివాడు ఎర్రని నిప్పుకాంతిలో ఏదో పనిచేసుకుంటు న్నాడు. వాడు సరిగ్గా కణ్ణప్పలాగేకన్పించేడు. ట్టికి. చెట్టి వాడికిదగ్గిరగా పోయేడు. ఇంత లో బావమరిది వచ్చి కల్సుకున్నాడు.

"ఎవరా ముసలివాడు?"

"ఏమో, బావగారు. పేరు నాకు తెలియదు. ఈ యుద్ధపు రోజుల్లో పనికి తగినంతమంది మనుషులు దొరక్క ముసలాళ్ళని కూడా పెట్టా ల్సివచ్చింది. వాడు చూసేరా!" ఇంకొక ముస లాడ్ని చూపెట్టేడు చెట్టికి "వాడొక నెల్లాళ్ళ ఏంచేస్తుయ్యేడిక్కడ."

చెట్టికి ఆ ముసలాడుకూడా కణ్ణప్పలాగే కన్పట్టేడు. ఆ ఊహకు తనలోతాను నవ్వు కున్నాడు. అసలు సంగతి ముసలివాళ్ళంతా కణ్ణప్పలా వుండడంకాదు, కణ్ణప్పే ముసలి వాడవడం. ముసలివాళ్ళంతా ఒకలాగే ఉంటారు, నిరాకారంగా, నెరసిన వెంద్రుకలతో — అంగులోను యిటువంటి వెల్తురులో.

కాని, వాడు కణ్ణప్పేనేమో? ఆ చేతి ఊపు, ఆ తలవంపు! చెట్టివాడికి కొంచెం దగ్గరగా పోయేడు.

ముసలవాడు లేచి "దణ్ణవండీ" అన్నాడు. చెట్టి బావమరిది కేమో అని అందుకోలేదు.

ముసలి అన్నాడు మళ్ళా "నేను, కణ్ణప్పనండీ ఏదోసిన్న పాలీస్ పనిసేసుకుంటు న్నాండీ. మా యిల్లు యిక్కడేండి.—"

చెట్టికి యిదంతా ఒక కలలా అనిపించింది.

"మీ షణ్ముఖం ప్రొద్దుట వచ్చి నువ్వు చచ్చి పోయావని చెప్పాడే."

"ఏఁ విటండోయి?" అన్నాడు బావమరిది.

ముసలివాడు - చిన్న చొక్క నవ్వుతో అన్నాడు "ఆ డలాగే నండి. సిన్నపిల్లాడండి. పపచం సరిగ్గా తెల్దండీ, ఆడికి."

తన కొడుకు తన గురించి యిట్టి మాటలు అనడం సహజంగా భావించిన ముసలివాడి మందహాసం చూచి చెట్టి నిర్ఘాంత పోయేడు.

ముసలివాడు మళ్ళా అన్నాడు "పిల్లాడండి, బాబు. మీ దయ సంపాదించుకొనే యాడండి, మొన్నే పెళ్ళి సేసుకున్నాడండి. ఈరోజుల్లో డబ్బు సాలక ఖర్చుకి ఏవోన్నా కావాల్సి అలా సప్పేడేమో, బాబూ. ఆడిమీద కోప్ప డకండి బాబూ!"